క్లుప్తంగా

దాసరి రామును పరామర్శించిన అంబటి



కొరిటిపాడు: పట్టణంలో కాపు, ఒంటరి, తెలగ, బలిజ జేఏసీ అధ్యక్షుడు దాసరి రాము కుమార్తె అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. దాసరి రామును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌ఐలు



నగరంపాలెం: విధులు సమర్థంగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఏఎస్‌ఐల నుంచి ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన మురళీధర్‌రావు (ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా), శ్రీనివాసరావు, అంజిరెడ్డి (ప్రకాశం జిల్లా) గుంటూరు జిల్లాకు బదిలీయ్యారు. బుధవారం ముగ్గురు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలి శారు. వారికి పోస్టింగులు కల్పిస్తూ, ఉత్తర్వులు జారీ చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

లక్ష్మీపురం: మనస్తాపంతో ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. నల్లపాడు రోడ్డు భవానీపురం 3వ లైన్‌కు చెందిన అన్నం సీత, భర్త దానయ్యలకు ఒక మగ, ముగ్గురు ఆడ సంతానం ఉన్నారు. వీరందరికి వివాహం అయింది. పెద్ద కుమార్తె జ్యోతికి 2007లో యర్రంశెట్టి వెంకటరావుతో వివాహం అయింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. వెంకటరావు కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వెంకటరావు స్నేహితుడైన శివరారెడ్డి ద్వారా వసుంధర పరిచయం అయింది. ఆమెకు జ్యోతి రూ.2లక్షలు నగదు అప్పుగా ఇచ్చింది. తిరిగి ఇవ్వమని అడిగితే ఇవ్వక పోవడంతో జ్యోతి ఆర్థికంగా ఇబ్బంది పడుతూ మనస్తాపంతో ఇంట్లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు జ్యోతి తల్లి దానమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు పోస్ట్‌మార్టానికి తరలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) నేతలు బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఫ్లెక్సీలు పట్టుకుని తిరుగుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జిల్లా చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, వేతన సవరణ అయిపోయి ఇప్పటికే రెండు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఐఆర్ ప్రకటించాలని కోరారు. గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నేతలు అమర్‌నాథ్, పీఎస్ రావు, కె. లక్ష్మయ్య పాల్గొన్నారు.

చనిపోతున్నానంటూ ఫేస్‌బుక్‌లో పోస్ట్

కేసు నమోదు చేసిన పోలీసులు

పట్నంబజారు: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తాను చనిపోతున్నానంటూ ఫేస్‌బుక్‌లో పెట్టిన సంఘటనపై కేసు నమోదు అయింది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌత్రా సెంటర్ గంజీబజార్‌లో నివాసం ఉండే వక్కలగడ్డ హరిప్రసాద్ స్వీట్ షాప్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరి సంతానం ఉన్నారు. ఈ క్రమంలో తండ్రి ఆస్తి దగ్గర హరిప్రసాద్‌కు అతని సోదరుడు శివనాగేశ్వరరావుకు మధ్య వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం హరిప్రసాద్ నుంచి వెళ్లిపోయి, ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. సాయంత్రం అతని ఇంటి ఎదురు వాళ్లకు హరిప్రసాద్ ఫేస్‌బుక్‌లో తాను చనిపోతున్నట్లు వీడియో పోస్ట్ చేశారు. భర్త చనిపోతాడన్న భయం ఉందని, భార్య వెంకట నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకాని రోడ్డులోని పద్మజ పెట్రోలు బంకు వద్ద ముక్కోటి గోపి గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పొట్లాలు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.



నీట మునిగిన చుట్టుగుంట రైతుబజార్



కంకరగుంట ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్



ఏటీ అగ్రహారంలో నీట మునిగిన వీధులు

నగరంలో కుండపోత వర్షం

- మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం
- నగరంలో ఎటు చూసిన నీట మునిగిన రోడ్లు, డ్రైయిన్లు, నివాసాలు
- ట్రాఫిక్‌తో స్తంభించిన జన జీవనం

నెహ్రూనగర్: నగరంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు, డ్రెయిన్లు, మార్కెట్లు జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లోని మూడు వంతెనలు, కంకరగుంట అండర్ పాస్, పట్టాభిపురం, విద్యానగర్, పాతగుంటూరు, లాలాపేట, ప్రగతీనగర్, నందివెలుగు రోడ్డు, ఏటీ అగ్రహారం, బీఆర్ స్టేడియం వద్ద, హుస్సేన్ నగర్, చంద్రబాబునాయుడు కాలనీ, చుట్టుగుంట, కేవీపీ కాలనీ, కాకాని రోడ్డులోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. కొన్ని ప్రాంతాల్లో కరెంట్ కోతల వల్ల నగర వాసులు ఇబ్బందులు పడ్డారు.

కార్పొరేషన్ కార్యాలయంలోకి చేరిన మురుగు నీరు

కార్పొరేషన్ కార్యాలయంలోకే వర్షపు నీరు చేరడంతో చేసేదేమి లేక మోటార్ల సాయంతో వాటిని బెయిల్ అవుట్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పాటు రైతు బజార్లు, కూరగాయాల మార్కెట్లలోకి నీరు చేరడంతో వ్యాపారస్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో పాటు కేంద్ర, ప్రభుత్వ కార్యాలయాలు, వేర్ హౌసింగ్‌లు కూడా నీట మునిగాయి.

ట్రా'ఫికర్'తో అవస్థలు

మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. నగరవాసులు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి పడేయడంతో ట్రాఫిక్ అంతా మూడు వంతెనలు, కొత్తపేట, అరండల్‌పేట, కంకరగుంట ఫ్లైఓవర్ మీద ప్రభావం చూపడంతో నగర వాసులు వర్షంలోనే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. నివాసితులు నీటిని తోడి బయటకు పోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడ్డిపాడు వద్ద చెరువు కట్ట తెగి ఇంటి గోడ పడిపోయి ఇళ్లలోకి చేరింది.

పూడికతీయకపోవడం ఒక కారణం?

గుంటూరు నగరంలో 210 కిలోమీటర్ల మేర డ్రైన్లు విస్తరించి ఉన్నాయి. వీటిలో మేజర్ డ్రైన్లు 125.28 కిలోమీటర్లు, మీడియం డ్రైన్లు 67.41, మైనర్ డ్రైన్లు 16.25 కిలో మీటర్లుగా ఉన్నాయి. వర్షకాలానికి ప్రారంభానికి ముందే మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ కింద డ్రెయిన్ల పూడికతీత పనులు రూ.4.78కోట్లతో ప్రారంభించారు. అయితే, కాంట్రాక్టర్లు పైపైన పూడిక తీసి వెళ్లిపోవడం వల్ల ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలో పలు ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. పూడికతీత సక్రమంగా చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజా సమస్యలు పట్టని పాలకులు

పట్నంబజారు: ప్రజా సమస్యలు పట్టని పరిస్థితుల్లో కూటమి పాలకులు, అధికారులు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. మంగళవారం రాత్రి భారీగా కురిసిన వర్షానికి అతలాకుతలమైన పలు ప్రాంతాలను బుధవారం ఆమె సందర్శించారు. ముందుగా గడ్డిపాడు సమీపంలోని చెరువుగట్టు తెగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆమె అక్కడకు చేరుకుని, స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు గట్టు తెగిపోయి నీరు నివాసాల్లోకి చేరుతోందని స్థానికులు చెప్పటంతో అక్కడ నుండే అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు.

ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నగరం జలమైన పరిస్థితుల్లో కనీసం అధికారులు, పాలకులు పట్టించుకునే పరిస్థితుల్లో లేకపోవటం సిగ్గుచేటని తెలిపారు. అభివృద్ధి అంటే ఇదేనా.. చంద్రబాబు ? అని సూటిగా ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల నేతలు, నగర కమిటీ నేతలు, తూర్పు నియోజకవర్గ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.



వర్షపు నీటిలో ఆర్టీసీ బస్టాండ్



నీట మునిగిన కంకరగుంట ఆయూర్‌బీ

జలమయమైన ఆర్టీసీ బస్టాండ్

పట్నంబజారు: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైంది. గుంటూరు 1, 2 డిపోల పరిధిలోని గ్యారేజీలు నీట మునిగాయి. బస్టాండ్‌లో ఆవరణలో కూడా నీరు చేరటంతో ప్రయాణీకుల రాకపోకలు తగ్గాయి. దీనితో పాటుగా డిపో 1 పరిధిలో ఉన్న రూట్లులో నాలుగు ప్రాంతాల్లో వాగులు పొంగటంతో ఆయా ప్రాంతాల్లో రూట్లు రద్దు చేసిన పరిస్థితి. తాడికొండ వైపు వెళ్ళాల్సిన బస్సులు, మంగళగిరి మీదుగా తిప్పినట్లు అధికారులు తెలిపారు. సచివాలయం, హైకోర్టు, ఇతర కార్యాలయాలకు వెళ్ళే సిబ్బందికి సైతం మంగళగిరి మీదుగానే వెళ్లినట్లు తెలుస్తోంది. సుమారుగా 50 సర్వీసులకు రద్దు అయి ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఎంత నష్టం వచ్చిందనేది అంచనా వేయాల్సి ఉందని తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

నెహ్రూనగర్: నగరంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలకు సమస్యలు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా వార్డుల వారీగా అధికారులను సమన్వయం చేసుకోవాలని కార్పొరేటర్లకు సూచించారు. శివారు ప్రాంతాల్లో నీరు అధికంగా నిలిచే ప్రాంతాల్లో నీటిని తొలగించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం శంకర్ విలాస్ వంతెన మీద రాకపోకలు నిలిచినందున ప్రధాన ప్రత్యామ్నాయ మార్గమైన కంకరగుంట ఆర్‌యూబీ దగ్గర నీరు నిలవకుండా అదనపు మోటార్లను, సిబ్బందికి కేటాయించాలని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు కార్పొరేటర్ల సహకారంతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆహారం అందించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే 24 గంటలు పని చేసేలా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ (0863–2345103)ని సిద్ధం చేశామని, ప్రజలు తమకు వర్షాల వల్ల ఎదురయ్యే సమస్యలపై కాల్ చేయవచ్చని తెలిపారు. సమావేశంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నకిలీ నోట్లు మారుస్తున్న వ్యక్తి అరెస్టు

లక్ష్మీపురం: నగరంలో చిరు వ్యాపారుల వద్ద నకిలీ రూ.500 నోట్లు మారుస్తున్న వ్యక్తిని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల పట్టణం, వివేకానంద కాలనీకి చెందిన బక్క గోపి అలియాస్ గోపిరెడ్డి మొదటి భార్య చనిపోగా, రెండవ భార్యతో కలసి గుంటూరు పట్టణం, రత్నగిరి నగర్ 1వ లైన్‌లో నివాసం ఉంటున్నాడు. బక్క గోపీకి హైదరాబాద్‌కు చెందిన భరత్ రెడ్డి పరిచయం అయ్యాడు. అతడు నకిలీ బంగారపు బిస్కెట్లు, నకిలీ కరెన్సీ నోట్స్, నకిలీ వజ్రాలు అమ్మే కలకత్తాకు చెందిన గోపాల్ అనే వ్యక్తిని గోపీకి పరిచయం చేశాడు. గోపి సుమారు 25 రోజులు క్రితం కలకత్తా వెళ్లి గోపాల్ వద్ద 160 నకిలీ రూ.500 నోట్స్‌ని కొని గుంటూరు తదితర ప్రాంతాల్లో మారుస్తూ ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి గోపీని అదుపులో తీసుకుని విచారించారు. విచారణలో రూ.500 నకిలీ నోట్లు మారుస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



అరెస్ట్ చేసిన వ్యక్తితో పట్టాభిపురం పీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగేంద్ర

అహల్య హాస్పిటల్‌లో 'హర్ ఘర్ తిరంగా'

గుంటూరు మెడికల్: అహల్య హాస్పిటల్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బుధవారం విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ త్రివర్ణ పతాకం మన దేశ గౌరవం, మన స్వేచ్ఛా పోరాటానికి సాక్ష్యం అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, సమాజంలో ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది, నర్సులు పాల్గొన్నారు.



జాతీయ జెండా పట్టుకుని నినాదాలు చేస్తున్న డాక్టర్ శనక్కాయల రాజకుమారి, నర్సులు, వైద్య సిబ్బంది

నేడు కళాశాలలో తరగతి గదుల నిర్మాణం ప్రారంభం

మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ శనక్కాయల అరుణ గుంటూరు ప్రభుత్వ మహిళ కళాశాలలో మూడు తరగతి గదుల నిర్మాణం చేయించారు. గురువారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు మొహమ్మద్ నసీర్ అహ్మద్ ప్రారంభిస్తారు.

రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలి

నెహ్రూనగర్: శంకర్ విలాస్ వంతెన పనుల వల్ల ట్రాఫిక్ సమస్య రాకుండా చేపట్టిన ప్రత్యామ్నాయ రోడ్ల విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం విస్తరణ పనులు జరుగుతున్న బ్రాడీపేట 1/18వ లైన్, బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్, పట్టాభిపురం రోడ్డులో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ వెంకట రమణ, ఇన్‌చార్జి ఎంహెచ్ఓ రామారావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల హవా

లక్ష్మీపురం: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా క్రీడాకారులు ఇటీవల చీరాలలోని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో జరిగిన ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో 31 మెడల్స్ సాధించారని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ బుధవారం తెలిపారు. 14 బంగారు పతకాలు, 11 వెండి పతకాలు, 6 కాంస్య పతకాలు గెలుపొందారని పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా సంఘం చైర్మన్ జి శేషయ్య, ఏబీసీ కార్యదర్శి జి. ఉషారాణి, సంఘం సభ్యులు అభినందించారు.

23న వాహనాలకు వేలం పాట

పట్నంబజారు: పన్నులు చెల్లించకుండా తిరుగుతూ దాడుల్లో పట్టుబడి, నిర్బంధంలో ఉన్న వాహనాలకు ఈనెల 23న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు డీటీసీ కె.సీతారామిరెడ్డి బుధవారం తెలిపారు. గుంటూరు స్వర్ణభారతీనగర్‌లోని కార్యాలయంలో ఉన్న 31 కార్లు, ద్విచక్ర వాహనాలను వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆర్టీఓ కార్యాలయం వద్ద హాజరు కావాలని సూచించారు. ఈనెల 22లోపు వాహనాలకు సంబంధించి నిర్బంధంలో ఉన్న యజమానులు చలానాలు చెల్లించి తీసుకెళ్లాలని, లేని పక్షంలో వేలం పాట నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

జాతీయ జెండా ప్రదర్శన వాయిదా

నెహ్రూనగర్: నగరంలో మంగళవారం జరగాల్సిన హర్ ఘర్ తిరంగా 10 కిలోమీటర్ల జాతీయ జెండా ప్రదర్శన ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల వల్ల తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయి కార్యక్రమంగా చేపట్టనున్న ప్రదర్శన తదుపరి నిర్వహించే తేదీని ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పట్నంబజారు: విద్యుత్ షాక్ కొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైలుపేటలోని గాంధీ విగ్రహం వద్ద శంకరమంచి వారి వీధిలో నివాసం ఉండే రావూరి హరిప్రసాద్ (49) జీఎంసీలో గ్యాంగ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఇంట్లోని మోటార్ స్విచ్ వేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హడావుడిగా ఆసుపత్రికి తీసుకుని వెళ్లేసరికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్ ఎదుట ఆందోళన

గుంటూరు మెడికల్: తుళ్లూరు మండలం మందడం గ్రామానికి చెందిన పిల్ల పాగ కిరణ్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ గుంటూరు జీజీహెచ్ ఎదుట మృతుడి బంధువులు ఆందోళన చేశారు. ఈనెల 8న తమ గ్రామానికి చెందిన నరేష్ రాత్రి 11 గంటల సమయంలో కిరణ్‌ను బండి మీద తీసుకెళ్లారని, 9వ తేదీ ఉదయం 6 గంటలకు కిరణ్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, అంబులెన్సు డ్రైవర్ ఫోన్ చేయడం ద్వారా తెలిసిందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కిరణ్‌ను అతని స్నేహితులు సలాం, భరత్, నరేష్, శ్రీనులు జీజీహెచ్‌లో చేర్పించి, ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి పారిపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుందని తెలిపారు. అమరావతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కిరణ్ స్నేహితులను అరెస్టు చేసి విచారించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



జీజీహెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న కిరణ్ బంధువులు

పోలీస్ పెట్రోల్ బంక్‌కు విక్రయాలలో ఉత్తమ నిర్వహణ అవార్డు

అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

నగరంపాలెం (గుంటూరు ఈస్ట్): అత్యుత్తమ నాణ్యత, పరిమాణంతో వాహనదారులకు ఇంధనం నింపాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో రిటైల్, ఔట్లెట్ డీలర్స్ సమావేశం జరగ్గా, గుంటూరు పోలీస్ శాఖ నగరంపాలెంలో నిర్వర్తించే పోలీస్ పెట్రోల్‌బంక్‌కు విక్రయాల విభాగంలో ఉత్తమ నిర్వహణ అవార్డును విజయవాడ డివిజనల్ కార్యాలయ మేనేజర్ రాజేష్ బంక్ ఇన్‌ఛార్జ్ ఏఆర్ ఏఎస్ఐ రత్నకుమార్‌కు అందించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పెట్రోల్‌బంక్‌ను జిల్లా ఎస్పీ సందర్శించారు. ఉత్తమ నిర్వహణ అవార్డు స్వీకరించడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. సమర్థంగా విధులు నిర్వర్తించిన సిబ్బందిని, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్‌ను అభినందించారు. అనంతరం పెట్రోల్ బంక్ పరిసరాలను పరిశీలించారు. వాహనదారులతో మర్యాదగా మెలగాలని అన్నారు.



అధికార, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ

నగరపాలక సంస్థ ఉద్యోగినికి షోకాజ్ నోటీసు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో ఆర్ఐగా పనిచేస్తున్న రేణుక దుర్గాభవానీకి నగర అదనపు కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రవీంద్రనగర్‌లో మున్సిపల్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న రమాదేవి 2021లో పీఎఫ్ ఖాతా నుంచి రూ. 8,21,000 డ్రా చేసుకున్నారు. అయితే, సదరు సొమ్ము పీఎఫ్ ఖాతాలో విత్ డ్రా చేసుకున్నట్లు సెక్షన్‌లో పనిచేసే రేణుకా దుర్గా భవానీ(ప్రస్తుతం ఆర్ఐగా పనిచేస్తున్నారు) నమోదు చేయలేదు. సదరు టీచర్ లోన్ తీసుకున్నప్పటికీ తీసుకోలేనట్లుగా పీఎఫ్ ఖాతాలో కనిపిస్తోంది. ప్రస్తుతం మున్సిపల్ టీచర్లను విద్యాశాఖకు బదిలీ చేయడంతో పీఎఫ్ ఖాతాను సెటిల్‌మెంట్ చేసుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయానికి సదరు టీచర్ వచ్చారు. విషయం తెలుసుకుని నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అదనపు కమిషనర్ దుర్గాభవానీకి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ఫేజ్ థెరపీతో రోగి ప్రాణాలు కాపాడారు

ఏపీలో మొట్టమొదటిసారిగా చికిత్స

గుంటూరు మెడికల్: వ్యాధి నియంత్రణకు వాడే యాంటిబయాటిక్స్ పనిచేయక రోగి తీవ్ర అనారోగ్యానికి గురై, ప్రాణాపాయ స్థితిలో తమ వద్దకు వస్తే ఏపీలోనే మొట్టమొదటిసారిగా ఫేజ్ థెరపీ నూతన చికిత్స ద్వారా రోగి ప్రాణాలు కాపాడినట్లు ప్రముఖ ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, సమిష్ట హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (శ్రీ) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొగంటి కళ్యాణ్ చక్రవర్తి చెప్పారు. బుధవారం అరండల్‌పేటలోని శ్రీ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అరుదైన చికిత్స విధానం గురించి మీడియాకు వివరించారు. బాపట్ల జిల్లా ఈదులపల్లికి చెందిన 72 ఏళ్ల ప్రభావతి థైరాయిడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు చెప్పారు. క్యాన్సర్ కుడి తుంటికి సోకి బోన్ పూర్తిగా దెబ్బతిందన్నారు. వైద్యులు కుడి తుంటికి శస్త్రచికిత్స చేసి ఇంప్లాంట్ అమర్చారన్నారు. ఇన్‌ప్లాంట్ అమర్చిన అనంతరం తీవ్రంగా ఇన్‌ఫెక్షన్ సోకి ఆపరేషన్ జరిగిన ప్రదేశంలో గాయం మానక తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆరునెలలుగా ఇంట్లో మందులు వాడినా గాయం మానకపోగా, విచ్చలవిడిగా యాంటి బయాటిక్స్ వాడడం వల్ల రక్తం శాతం తగ్గిపోయి, పల్స్ లేక అపస్మారక స్థితిలో తమ ఆసుపత్రికి జనవరిలో వచ్చిందన్నారు. యాంటి బయాటిక్స్ విచ్చలవిడిగా వాడడం వల్ల మందులు పనిచేయడం లేదని నిర్ధారించి, ఆమె శరీరంలో యసినికో బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారించామన్నారు. బెనారస్ విశ్వవిద్యాలయానికి చెందిన గోపాల్‌నాథ్ ఫేజ్‌లు పంపించడం ద్వారా తాము ఈ ఏడాది జనవరి 26న ప్రభావతి గాయాన్ని ఓపెన్ చేసి, శరీరంలోకి ఫేజ్-1 పంపించామన్నారు. ఒక సారి ఫేజ్ థెరఫీ చేసి, మూడు రోజులపాటు ఆసుపత్రిలో ఉంచి మరలా వారం తరువాత రెండో సారి ఫేజ్ థెరఫీ చేశామన్నారు. కేవలం రెండు సార్లు ఫేజ్ థెరఫీ ద్వారా రోగిని తాము బతికించడం గర్వంగా ఉందన్నారు. సమావేశంలో డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.



వృద్ధురాలితో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ రామకృష్ణ